ప్రజాశక్తి
శుక్రవారం 27 అక్టోబరు 2023
5
శ్రీకాకుళం

30 నుంచి బిఎస్ఎన్ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు పారదర్శక, మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ఈనెల 30 నుంచి నవంబరు ఐదో తేదీ వరకు విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాలు శ్రీకాకుళం కార్యాలయ ప్రదేశంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బిఎస్ఎన్ఎల్ సంస్థకు సంబంధించిన అవినీతిపై ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు తెలిపారు. తమ ఫిర్యాదులను ఉప మండల ఇంజనీర్ (విజిలెన్స్), జనరల్ మేనేజర్ కార్యాలయం, సంచార్ భవన్, శ్రీకాకుళం కార్యాలయంలో స్వయంగా గానీ, పోస్టల్ ద్వారా గానీ అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08942-226700, 9441668789 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వాస్తవాలు చెప్పేందుకే యాత్ర

- ప్రజలకు ఏం చేశామో, ఏం చేస్తామో చెప్తాం
- వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, మంత్రి బొత్స సత్యనారాయణ
- టిడిపి హయాంలోనే వలసలు : మంత్రి ధర్మాన
- వైసిపి సామాజిక సాధికార యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, కవిటి, పలాస

రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతిపక్షాల కుట్రలను ప్రజలకు వివరించేందుకే సామాజిక సాధికార బస్సు యాత్ర చేపట్టామని వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైసిపి కార్యాలయంలో బస్సు యాత్రను గురువారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు విలేకరుల సమావేశంలో, పలాసలో మేధావులతో ముఖాముఖి, ఇచ్ఛాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అవినీతిలో కూరుకుపోయిన టిడిపికి కొందరు వత్తాసు పలుకుతున్నారన్నారు. నిజానిజాలు బట్టబయలు చేసి ప్రజలకు వివరిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి, వారి జీవన ప్రమాణాలు పెరిగేలా చూశామని చెప్పారు. రాబోయే కాలంలో ఆయా తరగతులకు ఏవిధంగా న్యాయం చేస్తామో తెలియజేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రలో ఉద్దాన ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, కిడ్నీ ఆస్పత్రిని మంజూరు చేశారని చెప్పారు.

టిడిపి హయాంలోనే వలసలు : ధర్మాన

టిడిపి ప్రభుత్వ హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగకపోగా, జిల్లా నుంచి వలసలు మాత్రం పెరిగాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. దేశంలో ఎక్కడికి వెళ్లినా జిల్లావాసులు కనబడేవారని, ఇప్పుడా పరిస్థితి మారిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్ఛాపురం నియోజకవర్గానికి జెడ్పి చైర్పర్సన్, ఎమ్మెల్సీ, అనేక కార్పొరేషన్ పదవులు కేటాయించి ఏ నియోజకవర్గానికి ఇవ్వని ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. అందుకు కృతజ్ఞతగా వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురంలో వైసిపి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. వైసిపి ప్రభుత్వం అవినీతికి తావులేకుండా పేదరికానికి ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. కరెంట్ ఛార్జీలు, ఉల్లి ధరలు పెరిగాయంటూ టిడిపి నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని... దేశవ్యాప్తంగా విద్యుత్ ఛార్జీలు పెరిగాయన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

అభివృద్ధే లక్ష్యం : మంత్రి అప్పలరాజు

రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస నియోజకవర్గంలో రూ.700 కోట్లతో మంచినీటి పథకం, కిడ్నీ ఆస్పత్రి నిర్మాణం, సచివాలయాలు, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు.

పేదలకు అండగా ఉన్నందుకు ఓడించాలా?

టిడిపి నాయకులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఓడించాలని పిలుపునిస్తున్నారని, వైసిపి ప్రభుత్వం పేదలకు అండగా ఉన్నందుకు ఓడించాలా అని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రశ్నించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు.

దళితుల అభివృద్ధికి బాటలు

దేశ చరిత్రలోనే సామాజిక విప్లవానికి తెరతీసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. టిడిపి హయాంలో దళితులపై దాడులు, చివరికి అంబేద్కర్ విగ్రహం పెట్టేందుకూ ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. దళితులు తలెత్తుకు తిరిగేలా వైసిపి ప్రభుత్వం బాటలు వేసిందన్నారు.

జిల్లాకు చేసింది శూన్యం

ఎప్పుడో బ్రిటిష్ వాళ్లు వేసిన రైల్వే ట్రాక్ తానే వేయించానని, ప్రభుత్వం విడుదల చేస్తున్న జిఒలు తనవల్లే అని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు గొప్పలు చెప్పుకోవడం తప్ప జిల్లాకు చేసింది శూన్యమని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త పిరియా సాయిరాజ్ విమర్శించారు. ఇచ్ఛాపురం నుంచి రెండుసార్లు గెలిచినా ఎమ్మెల్యే బెందాళం అశోక్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు.

కార్యక్రమంలో వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వై.వి సుబ్బారెడ్డి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పి చైర్పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే వి.కళావతి, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, యూత్ వింగ్ జోనల్ ఇన్ఛార్జి ఎ.సత్యనారాయణ, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఘన స్వాగతం

వైసిపి నేతలు చేపట్టిన బస్సు యాత్రకు పలుచోట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నరసన్నపేట, కోటబొమ్మాళి ప్రాంతాల్లో జాతీయ రహదారిపై పార్టీ శ్రేణులు, మహిళలు నిల్చొని స్వాగతం పలికారు. కాశీబుగ్గ కోసంగిపురం జంక్షన్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. యాత్రకు మద్దతుగా పలుచోట్ల బైక్ ర్యాలీలు నిర్వహించారు.

జనం ఇక్కట్లు

ఇచ్ఛాపురంలో ప్రధాన రహదారిపైనే సభ నిర్వహించడంతో జనం ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్ దగ్గర సభాస్థలి ఏర్పాటు చేయడంతో ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులను రెండు కిలోమీటర్ల దూరంలోనే ఆపేశారు. దీంతో లగేజీలతో నడవలేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. చిన్నారులు, వృద్ధులు బాగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సభకు పెద్దఎత్తున డ్వాక్రా మహిళలను తరలించారు.

సభకు హాజరైన జనం

ఎమ్మెల్యే అశోక్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఎమ్మెల్యే అశోక్ అరెస్టు

గౌతు శిరీష గృహ నిర్బంధం

ప్రజాశక్తి - కవిటి, పలాస

సామాజిక సాధికార యాత్రను వ్యతిరేకిస్తూ ఇచ్ఛాపురం టిడిపి ఎమ్మెల్యే బెందాళం అశోక్ నల్ల జెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కవిటి మండలం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కవిటి బస్టాండ్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వరకు టిడిపి శ్రేణులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఐ రాము నేతృత్వాన పోలీసులు ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులను అరెస్టు చేసి కవిటి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడిచిపెట్టారు.

పలాసలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషతో పాటు పలువురు నాయకులు పోలీసులు గృహ నిర్బంధం చేశారు. సోంపేటకు కారులో బయలుదేరుతున్న శిరీషను పోలీసులు అడ్డుకున్నారు. యాత్ర నేపథ్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతారన్న ఉద్దేశంతో హౌస్ అరెస్టు చేశారు.

ప్రజలకు ఏం చేశారని సామాజిక సాధికార యాత్రలు చేస్తున్నారని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రశ్నించారు. అరెస్టుకు ముందు కవిటి మండలం రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిత్లీ తుపాను బాధితులకు అదనపు పరిహారం ఇస్తామని చెప్పి ఇవ్వనందుకు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో యాత్ర ప్రారంభిస్తున్నారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్ చేసిన నేరాలకు జైలు శిక్ష అనుభవించాడు కాబట్టి ప్రతిపక్ష నేతలపైనా అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేశామని యాత్రలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. రెండు రోజులుగా ఇచ్ఛాపురం మెయిన్ రోడ్డును దిగ్బంధించి స్థానికులు, ప్రయాణికులకు ఇబ్బందులు పెట్టి రోడ్డుకు అడ్డంగా సభ ఏర్పాటు చేశారని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

నయవంచన యాత్ర

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైసిపి నాయకులు చేపట్టింది సామాజిక సాధికార యాత్ర కాదని, నయవంచన యాత్ర అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. ఎస్సి, ఎస్టి, బిసిలు తన వాళ్లంటూ వారి గొంతు కోయడమే సామాజిక న్యాయమా అని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఎస్సి, ఎస్టి, బిసిలకు తీరని అన్యాయం చేసిందన్నారు. దళిత డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును వైసిపి నుంచి బహిష్కరించలేదన్నారు. ఆయన సిఎం జగన్‌తోనే తిరుగుతున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 25 మంది దళితులు హత్యకు గురైనా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అయేషా మీరా, కోడి కత్తి కేసులో నిందితులైన దళితులు సత్యంబాబు, శ్రీను జీవితాలను నాశనం చేశారన్నారు. ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్లు తీసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో బాక్సైట్‌ను కొల్లగొడుతూ ఎస్‌టిలకు అన్యాయం చేస్తున్నారని చెప్పారు. రిజర్వేషన్లలో పది శాతం కోత పెట్టడంతో రాజ్యాంగబద్ధ పదవులు రాకుండా చేసి బిసిలకు అన్యాయం చేశారని తెలిపారు. సీనియార్టీలో ముందున్న బిసికి చెందిన ద్వారకా తిరుమలరావును పక్కనపెట్టి 14 స్థానంలో ఉన్న రాజేంద్ర రెడ్డిని డిజిపి పదవిలో కూర్చోబెట్టారని విమర్శించారు. 56 కార్పొరేషన్లకు నిధులు కేటాయించలేదని, జిఒ నంబరు 217 ద్వారా మత్స్య వృత్తిని నాశనం చేశారని ఆరోపించారు. రంజాన్ తోఫా రద్దు, దుల్హన్ పథకాన్ని నీరుగార్చి షాదీఖానా నిలిపివేసి మైనార్టీలకు అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. నవరత్నాలంటూ ప్రజలకు జగన్ నవ మోసాలు చేశారని మండిపడ్డారు.

నేడు ఓటరు జాబితా ముసాయిదా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఓటరు జాబితా ముసాయిదాను ఈనెల 27న ప్రచురించనున్నామని, వాటిలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టరేట్‌లోని డిఆర్ఒ ఛాంబరులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలను ప్రతిఒక్కరూ పరిశీలించుకోవాలని వాటిలో తొలగింపులు, చేర్పులు వంటి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఫారం-6, 7, 8 ద్వారా వాటిని సరిచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ముసాయిదా లోని క్లయిమ్‌లు, అభ్యంతరాలను 27 నుంచి డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు స్వీకరించ నున్నట్లు చెప్పారు. డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరిస్తామని, జనవరి ఐదో తేదీన తుది జాబితాను ప్రచురించ నున్నట్లు వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని, ఆయా తేదీలను ముందుగా ప్రకటిస్తామని తెలిపారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి తప్పుడు ఫారం-7 అందజేస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్యాలెట్ యూనిట్లు 7,530, కంట్రోల్ యూనిట్లు 5,850, వివి ప్యాట్‌లు 7070 జిల్లాకు చేరాయని చెప్పారు. మొదటి దశ తనిఖీల ప్రకారం 7,523 బ్యాలెట్ యూనిట్లకు గానూ 2,440, 5,831 కంట్రోల్ యూనిట్లకు గానూ 2020, 7,105 వివి ప్యాట్లకు గానూ 2,300 పూర్తిగా పనిచేసున్నాయని తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు 4, కంట్రోల్ యూనిట్లు 8, వివి ప్యాట్లు 24 తిరస్కరించామన్నారు. ఇవిఎంల వినియోగంలో ఎటువంటి అపోహలు ఉన్నా నిపుణులు నివృత్తి చేస్తారని తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, కాంగ్రెస్ నాయకులు డి.గోవింద మల్లిబాబు, సిపిఎం నాయకులు డి.గోవిందరావు, భవిరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్ఒ గణపతిరావు

10 నుంచి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నవంబరు పదో తేదీ నుంచి నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో చెకుముకి సంబరాల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తేదీన పాఠశాల స్థాయిలో, 30న మండల, పట్టణ స్థాయిలో డిసెంబర్ 17న జిల్లాస్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల అనంతరం వచ్చే ఏడాది జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే ఈ సంబరాల ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వాగ్దేవి, జిల్లా ఆడిట్ కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు, జిల్లా పర్యావరణ కమిటీ కన్వీనర్ ఎ.వాసుదేవరావు, ధనలక్ష్మి, సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ వెంకటేశ్వరరావు

జీడి రైతులను విస్మరించడం తగదు

పలాస : 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్న జీడి రైతుల డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం తగదని జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ అన్నారు. కాశీబుగ్గలోని సిఐటియు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీడికి మద్దతు ధరను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఆరు నెలలుగా అనేకరూపాల్లో ఆందోళనలు చేపడుతున్నా స్పందించకపోవడం దారుణమన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం, జీడి రైతుల గోడు పట్టడం లేదని విమర్శించారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఎవరిని మభ్యపెట్టడానికని ప్రశ్నించారు. రైతుల గోడు వినకుండా, సమస్యలు పరిష్కరించకుండా యాత్రలు చేయడం వల్ల ప్రజానీకానికి ఒరిగేదేముందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా జీడికి మద్దతు ధరపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జీడి రైతుసంఘం నాయకులు కె.వినోద్ కుమార్, కె.గురయ్య, అంబటి రామకృష్ణ, సిఐటియు నాయకులు ఎన్.గణపతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అజయ్ కుమార్

ఉత్సాహంగా అండర్-19 ఫెన్సింగ్ పోటీలు

శ్రీకాకుళం అర్బన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యాన నగరంలోని టౌన్‌హాల్ వేదికగా అండర్-19 జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బలభద్రుని సురేష్ కుమార్ (రాజా) గురువారం ప్రారంభించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో నంద్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్-19 ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాజా మాట్లాడుతూ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా ఫెన్సింగ్ ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ, పిఇటి రాహుల్ వ్యవహరించారు. ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎన్.రామన్న, రాష్ట్రస్థాయి అండర్-19 పోటీల అబ్జర్వర్ డి.భవాని పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మంత్రి బొత్సకు మీటర్ రీడర్ల వినతి

కవిటి : నెలవారీ వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్లు కోరారు. ఈ మేరకు మంత్రి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పి చైర్పర్సన్ పిరియా విజయకు గురువారం ఇచ్ఛాపురంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో సుమారు 3,800 మంది మీటర్ రీడర్లు 15 నుంచి 25 ఏళ్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి వస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం తమ మనుగడే ప్రశ్నార్థకంగా మారనుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సరైన వేతనం, ఉద్యోగ భద్రత లేక తమ కుటుంబాలు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలవారీ వేతనాలు అమలు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జి.ఆనందరావు, డి.భాస్కరరావు, పి.లోకనాథం, కె.మనోహర్, పి.సంతోష్ కుమార్ తదితరులున్నారు.

నిర్ణీత గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి - ఆమదాలవలస

నిర్ణీత గడువు లోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తొగరాంలో గల స్పీకర్ క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గానికి సంబంధించిన హౌసింగ్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గాజుల కొల్లివలసలో సుమారు 1734 ఇళ్ల పట్టాలు మంజూరు చేశామన్నారు. పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలో వేసిన లేఅవుట్లు, సొంత స్థలాల్లో కలిపి సుమారు 8, 598 ఇళ్లు మంజూరయ్యాయని వాటి నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటివరకు 5,334 ఇళ్లు పూర్తయ్యాయని 1,440 ఇళ్లు పలు దశల్లో నిర్మాణంలో ఉన్నాయని అధికారులు వివరించారు. మిగతా ఇళ్ల నిర్మాణాలు ఎందుకు ప్రారంభించలేదని స్పీకర్ ప్రశ్నించారు. డిసెంబరు నెలాఖరుకు ప్రతి లేఅవుట్‌లో శతశాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పుడు నిర్మిస్తున్నవి జగనన్న కాలనీలు కాదని, కొత్తగా ఊళ్లనే ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు అవసరమైన సామగ్రిని ప్రభుత్వమే అందిస్తోందన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ గణపతి, ఇఇ అప్పారావు, ఎఇలు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ సిబ్బందిని ప్రశ్నిస్తున్న స్పీకర్ సీతారాం

తెలుగుశక్తి ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ తెలుగుశక్తి ఆధ్వర్యాన చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అరసవల్లి ఆలయ ప్రాంగణం వద్ద గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగుశక్తి అధ్యక్షులు బి.వి రామ్‌తో కలిసి ఆమె మాట్లాడుతూ సిఎం జగన్‌ను పొగడ్తలతో ప్రసన్నం చేసుకునేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, వైసిపి నాయకులు భజన కార్యక్రమాన్ని చేపట్టారని చెప్పారు. ఆ కార్యక్రమానికి సామాజిక సాధికార బస్సు యాత్రగా పేరు పెట్టారని విమర్శించారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలకు ఏం న్యాయం చేశారని యాత్ర చేపట్టారని ప్రశ్నించారు. తల్లి, చెల్లికే న్యాయం చేయలేని వ్యక్తి ప్రజలకు ఏం చేస్తాడన్నారు. వైసిపి నాయకుల మాయమాటలను ప్రజలు విశ్వసించబోరని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తగ్గిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదారపు వెంకటేష్, కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

GURAJADA COLLEGE OF EDUCATION
MUNASABPETA - SRIKAKULAM.

PLACEMENT FOR HUMAN RESOURCE

1. Principal:
(i) Post Graduate degree in Science / Social Science Secured with 55% marks and M.Ed. Secured with 55% marks.
(ii) **8 years** Teaching Experience in College of Education with **Ph.D**

2. Lecturer in Pedagogy of Telugu:
Post Graduate degree in Telugu Secured with 55% marks and M.Ed. Secured with 55% of marks, with **NET/SET/ Ph.D.,** (or) The Candidates who have been ratified before 2017 in the reputable University.

The Eligible candidates send their Bio-data to given below e-mail id within 3 days from the date of paper notification.
email: **principalgurajada@gmail.com** Contact No's. : **9441730399, 731111029.**

Sd/-Secretary & Correspondent

మహారాజశ్రీ ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
IA.603/2023 In IA.582/2023 in. 0S.17/2022

Between:
పూజారి శ్రీలత --వాది
And:
గంద్రెడ్డినాగమ్మ వగైరాలు --ప్రతివాదులు

To,
ప్రతివాది నంబరు:5 (D-5)
గంద్రెడ్డి రమణమ్మ W/o లేటు మణిబాబు, హిందూ, 40 సంవత్సరాలు, గృహిణి, R/o: డోరు నంబరు: 10-2-198, ఊసవానిపేట గ్రామం, కసింవలస పోస్టు. ఆమదాలవలస మండలం, శ్రీకాకుళం జిల్లా-532185.

ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు పరిధి.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరుగల దావాలో మీకు నోటీసులు కోర్టు ద్వారా ఎన్నిసార్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు తేదీ **16-11-2023 న ఉ॥ గం॥ 10-30 ని॥ లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాబడి మీ వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు దావా మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)
చౌదరి లక్ష్మణరావు
వాది తరపు న్యాయవాది,
సెల్: 96407 80728.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా
ఆర్‌డిఒ భరత్ నాయక్

భరత్ నాయక్, ఆర్‌డిఒ

ప్రజాశక్తి- పలాస
పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, పేదలకు అండగా ఉంటానని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. పలాస డివిజన్ పరిధిలో అపారమైన సహజ వనరులు కలిగి ఉన్నాయని, డివిజన్‌లో అన్ని రంగాల్లో అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. డివిజన్ పరిధిలో భౌగోళిక పరిస్థితులను అవగాహన చేసుకొని ఈ ప్రాంతాభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిశీలన చేసి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని అన్నారు. విశాల సముద్ర తీరంతో పాటు ఉద్దానం, పల్లపు, గిరిజన ప్రాంతాలు కలిగి ఉన్న ఈ డివిజన్‌లో అన్ని ప్రాంతాల్లో ప్రజలు చైతన్య వంతులని, ప్రభుత్వాలు అందించే సంక్షేమ, అభివృద్ధి ప్రజలకు చేరువ చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటు ఉంటానని, ఎవరికి ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందుగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆర్‌డిఒకు తహశీల్దార్ మధుసూదనరావు, ఎంపిడిఒ రమేష్‌నాయుడు, విఆర్‌ఒల సంఘం నాయకులు సన్మానించారు.

కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సమీకృత సేకరణ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి- కవిటి
ఆరుగాలం కష్టపడి రైతు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర వచ్చేవరకు తమ పంటలను నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీపై నిర్మిస్తున్న సమీకృత సేకరణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపి ఎంఎస్ పిడీ ఆర్.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఆర్.వి.వి. ప్రసాదరావు సూచించారు. మండలంలోని ముత్యాలపేట, చండిపుట్టుగ, కవిటి గ్రామాల్లో నిర్మిస్తున్న సమీకృత సేకరణ కేంద్రాలను గురువారం పరిశీలించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడి ఈ కేంద్రాల వినియోగం, వాటి ఉపయోగాలు వివరించారు. రూ.15 లక్షల విలువైన ఈ కేంద్రాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 75 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవి, హెచ్ఇఒ టి.బాలరాజు, ఎంఐఒ బి.హరిప్రసాద్, ఎంపిఇఒలు ఎం.లలిత, వై.విష్ణు, రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాధికార యాత్ర విజయవంతం

సౌయరాజ్

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర విజయవంతమైందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్ర విజయవంతానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరం కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగురవేసేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

పోలాకి : నేత్రాలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

పొందూరు : సూచనలు ఇస్తున్న వాసుదేవరావు

పోలాకి : మండలంలోని రేగుపాడులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షను రెహమాన్‌పురం సర్పంచ్ సరసల సోమేశ్వరరావు ప్రారంభించారు. గుప్పిడిపేట పిహెచ్‌సి వైద్యులు రత్నరాజు, చందన, గోపాలోలు రోగులను పరిశీలించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కె.తాతారావు, వెంకటేశ్వరరావు, డిటి పి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఉషశ్రీ, కార్యదర్శి నాగరాజు, విఆర్‌ఒ వెంకట రమణ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ఆరోగ్యమే మహాభాగ్యమని ఎంపిడిఒ ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని నువ్వులరేవులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం రోగులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రా, వైస్ సర్పంచ్ దేవ,డిటి గిరిరాజు, వైద్యులు, అంగన్వాడీ కార్యకర్తలు ఇందు, చామంతి, కార్యదర్శి ఆదిల్ షా, విఆర్‌ఒ కె.హైమవతి పాల్గొన్నారు.

పొందూరు: మండలం బురిడి కంచరాంలో కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని నోడల్ అధికారి టి.వాసుదేవరావు పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, సర్పంచ్ ప్రతినిధి గంట్యాడ రమేష్, ఎంపిటిసి బొత్స రమణ, వైసిపి మండల జెసిఎస్ బాధ్యుడు వెంకట కృష్ణారావు, వైద్యాధికారులు సాగరిక, శివశంకర్, సిహెచ్ఒ వాణికుమారి, సూపర్‌వైజర్ మణిప్రసాద్, వైద్యసిబ్బంది, అంగన్వాడీ, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని కురుడు గ్రామ సచివాలయ పరిధిలో జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యులు డి.నీరజ, మనీష, ప్రీతి, జోత్స్న, సురేష్, నిఖిల్‌కుమార్ 391 మంది పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, డిటి ఆర్.మధు, ఇఒపిఆర్‌డి బొడ్డేపల్లి రామారావు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, రొక్కం సూర్యప్రకాష్, సర్పంచ్ కోత చిన్నారావు, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలం వల్లభరావుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, మండల మహిళా అధ్యక్షుడు గురాన మానస, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, గురాన చిరంజీవి, మహంతి సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

పాడైన పంటను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం
వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం సత్వరమే ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. మండలంలో నగరంపాలెం, ఉప్పునివలస గ్రామాల్లో నీరు లేక ఎండిపోయిన, తెగుళ్లు వచ్చిన పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల కాలువల ద్వారా నీరందక పంటలు నష్టపోయాయని, తెగుళ్లు వచ్చిన పంటలను గురువారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం కాలువల మరమ్మతులకు నిధులు కేటాయించకపోవడంతో శివారు భూములకు నీరందడం లేదని తెలిపారు. పంటలు పచ్చగా కనిపిస్తున్నా నీరులేక భూమి బీటలు వారిందన్నారు. వంశధార, నాగావళి నదుల్లో నీళ్లు ఉన్నా నీటి వినియోగంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తోటపల్లి కాలువలకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని, పంటలకు నీరులేక కరువు వల్ల తీవ్ర అన్యాయానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యామ్నాయంగా రెండో పంటకు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని, అన్నిరకాల రుణాలను రద్దు చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని, కాలువల మరమ్మతులు చేసి శివారు భూముల వరకు నీరు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ ద్వారా 200 రోజుల పనులు కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, పంటల బీమా రైతులందరికీ చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరితో పాటు బొంతు శ్రీరాం ఉన్నారు.

టిడిపి పరిశీలకులుగా 'పీరుకట్ల'

విశ్వప్రసాద్

ప్రజాశక్తి- బూర్జ
పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎన్నికల పరిశీలకులుగా మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్‌ను నియమించినట్లు తెలుగుదేశం పార్టీ అధిష్టానం నుండి గురువారం నియామక పత్రం విడుదలైంది. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విశ్వప్రసాద్‌ను సాలూరు నియోజకవర్గానికి ఎన్నికల పరిశీలకులుగా నియమించారు. ఈయన గతంలో ఎమ్మెల్సీగా, ఎంపిపిగా, తోటవాడ గ్రామ సర్పంచ్‌గా ఎన్నో పదవులను చేపట్టారు. ఈయన బూర్జ మండలంలోనే కాకుండా జిల్లాలో కూడా మంచిపట్టు సాధించారు. మండలంలో ఆమదాలవలస నియోజకవర్గంలో టిడిపి బలోపేతం అయ్యేందుకు అహర్నిశలు కృషి చేశారు. పీరుకట్ల విశ్వప్రసాద్ సాలూరు నియోజక వర్గ ఎన్నికల పరిశీలకులుగా నియామకంతో సాలూరు నియోజకవర్గంలో టిడిపి బలం పెంచుకుంటుందని, 2024లో టిడిపి ఘన విజయం సాధిస్తుందని టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నేడు టెక్కలి మండల సమావేశం

టెక్కలి రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి అట్టా సరోజమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంతో అధికారులు పాల్గొనాలని సూచించారు.

జూడో పోటీలకు తాడివలస విద్యార్థులు

ప్రజాశక్తి- పొందూరు
రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు దవళ వెంటయ్యలు గురువారం తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో అనంతపురంలోని ఆర్‌డిటి స్టేడియంలో జరుగనున్న ఈ జూడో పోటీల్లో పాఠశాలకు చెందిన కొత్తకోట నితిష్, వాకముల్లు కౌశిక్, కూన శివరామరాజు, మెట్ట ధార్మి, గొల్లపల్లి నీలిమ పాల్గొంటున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఈ జూడో పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపు తేవాలని విద్యార్థులను కోరారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మృతి చెందిన మేకలు

ఆరు మేకలు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని అంజనేయపురం సమీపంలో గురువారం మధ్యాహ్నం కలుషిత ఆహారం తిని ఆరు మేకలు మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే... టెక్కలి గొల్లవీధికి చెందిన కోరాడ వెంకటరమణకు చెందిన 20 మేకలను మేత కోసం అంజనేయపురం వైపు తీసుకెళ్లాడు. నడుచుకుంటూ మేత మేస్తూ... అలా కింద పడిపోయి గిలగిలా కొట్టుకుంటూ అక్కడికక్కడే మృతి చెందాయి. వెంటనే వెంకటరమణ మిగతా మేకలను తోలుకుని ఇంటికి తీసుకొచ్చాడు. కుక్కల కోసం గ్రామస్తులు విష ఆహారం పెట్టారని, వాటిని తిని మృతి చెందాయని తెలుస్తోంది. సమాచారం అందుకున్న టెక్కలి పశువైద్యాధికారి రఘునాథరావు మృతి చెందిన మేకలను పరిశీలించారు. కలుషిత ఆహారం తినే మృతి చెందాయని ధ్రువీకరించారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో కలుషిత ఆహారం తిని పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డాయి. మళ్లీ అదే తరహా ఘటన చోటుచేసుకోవడంతో చర్చనీయాంశమైంది.

సీతానగరంలో ధ్వంసమైన వరి పంట

వరి పంటలు ధ్వంసం

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ సీతానగరంలో పలువురు రైతుల వరి పొలాల్లో అడవి పందులు పంట నాశనం చేస్తున్నాయి. ఇప్పటికే నీరు లేక పంట ఎండిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటికి ప్రత్యామ్నాయంగా కొంతమంది రైతులు మోటార్ల ద్వారా పంటను కాపాడుకుంటున్నారు. నీరు అందుబాటులో ఉన్న రైతులు ఏదోరకంగా పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అడవి పందులు బెడదతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సీతానగరంలో గిన్ని హేమ సుందర్ రెడ్డి రెండు ఎకరాలు, గిన్ని అమర్నాథ్ రెడ్డి 3.5 ఎకరాలు, నీలాపు ప్రసాదరెడ్డి మూడెకరాలు, లింగాలు దాలయ్య ఐదెకరాలు వేసిన వరి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. కొద్ది రోజులుగా అడవిపందుల నుంచి రక్షణకు రైతులు ఎన్ని ప్రయత్నాలు చేసినా వాటి బెడద తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. సాగునీరు లేక బోర్ల పై ఆధారపడి పంటలు పండిస్తుంటే పంట అడవి పం దులు పాలవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉద్యమాలను ఆపలేరు

నోటీసు అందజేస్తున్న పోలీస్

కోటబొమ్మాళి: ముందస్తు నోటీసులతో సిపిఎస్ వ్యతిరేక ఉద్యమాలను ఆపలేరని సిపిఎస్ జిల్లా కన్వీనర్ గొండు నారాయణరావు అన్నారు. మంత్రుల ఇచ్ఛాపు రం చేపట్టిన బస్సు యాత్రకు ఆటంకం కలిగించవద్దని పోలీసులు నారాయణరావు ఇంటి గురువారం వెళ్లి ముందస్తు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ర్యాలీలో పాల్గొన్న స్వర్ణమణి

జన సమీకరణకు స్వర్ణమణి కృషి

ఇచ్ఛాపురం : పట్టణంలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికారిత బస్సు యాత్రకు మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డు నుంచి కౌన్సిలర్, వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి జనసమీకరణలో ఉత్సాహం చూపించారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ జనాలను సమీకరించాలని సూచించారు. దీంతో కేడర్ పోటీ పడి జనసమీకరణకు కృషి చేశారు. ఇందులో భాగంగా స్వర్ణమణి మహిళలను జనసమీకరించడంలో విజయవంతమయ్యారు.

చిట్టివలసలో ఆలయ ప్రతిష్ట

కోటబొమ్మాళి: మండలంలోని చిట్టివలసలో నూతనంగా నిర్మించిన సత్యసాయి బాబా ఆలయాన్ని గురువారం ప్రతిష్ఠించారు. ఈ మేరకు ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఈయనతో పాటు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపి వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి ఉన్నారు.

గిరిజనుల పొట్టకొట్టడం అన్యాయం

సరుబుజ్జిలి: గిరిజనుల పొట్ట కొట్టడం అన్యాయమని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి లక్ష్మీనారాయణ మండిపడ్డారు. గురువారం సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస గిరిజన గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు 40 ఏళ్ల నుండి సాగు చేసుకుని ఆ భూముల్లో జీడి మామిడి, టేకు, నీలగిరి, సపోటా, సీతాఫలం తదితర చెట్లను, పండ్ల మొక్కలను పెంచుకొని వాటి ద్వారా వచ్చే ఆదాయంతో కుటుం బాలను పోషించుకుంటున్నారని అన్నారు. ఆ భూమిపై కొందరు భూస్వాములు కన్నుపడి వారి ధన, అధికార బలంతో గిరిజనులకు నష్టం చేస్తున్న ఏకైకరా భూమిలో ఉన్న చెట్లను జెసిబితో కూల్చి వేశారన్నారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకూ గిరిజనుల పక్షాన పోరాడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జై ఆదివాసీ, జై జై ఆదివాసీ, ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలని పలువురు గిరిజన నాయకులు, ప్రజలు నినదించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరమేశ్వరరావు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

ప్రజాశక్తి- పలాస
కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు తెలిపారు. కాశీబుగ్గలో వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావును గురువారం కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇతర పార్టీలోకి వెళ్లిన ద్వితీయ శ్రేణి కేడర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానించేందుకు 'మన ఇంటికి రండి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వైసిపిలో కార్యకర్తలకు విలువలు లేకపోవడంతో వారంతా మళ్లీ కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులతో పాటు సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు అమ్మేస్తున్నారని అన్నారు. ఆయనతో పాటు పిసిసి ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, జీవన్ కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూదనరావు, సానమాన శ్యామసుందరరావు, మజ్జి బాబూరావు, కర్రి శాంతారావు, కొర్ల హేమారావు చౌదరి, బమ్మిడి రాజారావు, తంగుడు వీర్రాజు, శ్రీరంగం సురేష్ ఉన్నారు.

'ప్రజా రక్షణ భేరి'ని విజయవంతం చేయాలి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి
సిపిఎం ఆధ్వర్యాన నవంబరు 2న చేపట్టనున్న ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను మండలంలో ప్రారంభమవుతుందని, దీనిని విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు హనుమంతు ఈశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధికి సిపిఎం ఆధ్వర్యాన ఈ బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గొండు నీలన్న, జోగి లక్ష్మణరావు, సిహెచ్.వెంకటరావు, కె.అప్పలస్వామి, శ్రీను పాల్గొన్నారు.

వీధిదీపాలను అందిస్తున్న అరబిందో యాజమాన్యం

వీధిదీపాలు వితరణ

ప్రజాశక్తి- రణస్థలం
పైడిభీమవరం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సామాజిక బాధ్యతలో భాగంగా మండలంలోని సంచాం గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం రూ.5 లక్షల వ్యయంతో ఎల్ఇడి వీధిదీపాలు గురువారం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి రెడ్డి రాము మాట్లాడుతూ పైడిభీమవరం అరబిందో పరిశ్రమ యాజమాన్యం ఈ ప్రాంతంలో ఎంతో అభివృద్ధి చేసారన్నారు. సంచాం పంచాయతీకి వీధిదీపాలు అందించడం చాలా అభినందనీయమని అరబిందో ఫార్మా ఫౌండేషన్ యాజమాన్యం నిత్యానంద రెడ్డి, శరత్ చంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

19న జాతీయ శతాధిక కవి సమ్మేళనం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కుమార్‌రాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
శ్రీశ్రీ కళావేదిక ఆంధ్రరాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యాన నవంబరు 19న 125వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం విజయవాడలో మాకినేని బసవ పున్నయ్య కళాక్షేత్రంలో జరుగుతుందని శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ తెలిపారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సమ్మేళనం పోస్టర్‌ను కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజాతో కలిసి ఆవిష్కరించారు. గవర్నర్‌పేటలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్, కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ ఉపాధ్యక్షుడు హరి సర్వోత్తమ నాయుడు ఈనెపల్లి ఆధ్వర్యంలో పోలాపూరపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో సమ్మేళనం కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు జంధ్యాల శరత్ బాబు, కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వావిలపల్లి రాజారావు హాజరయ్యారు. మరిన్ని వివరాలకు 7893451307 సెల్ నంబరుకు సంప్రదించాలని సూచించారు.

శిలాఫలకాన్ని చూపిస్తున్న స్పీకర్ సీతారాం

సిఎం ఫొటో లేకపోతే ఎలా!

అధికారుల తీరుపై స్పీకర్ ఆగ్రహం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి
సరుబుజ్జిలి జంక్షన్ నుండి కొమనాపల్లి బ్రిడ్జి వరకు ఎస్‌డిఆర్‌పి నిధుల నుండి రూ.2 కోట్ల 20 లక్షలతో రోడ్డును అభివృద్ధి చేయడంకు స్పీకర్ తమ్మినేని సీతారాం గురువారం శంకుస్థాపన చేయడానికి సరుబుజ్జిలి జంక్షన్ చేరుకున్నారు. రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన స్పీకర్ శిలాఫలకంపై చూడగా స్పీకర్ చిత్రపటం ఒక్కటే కనిపించడంతో సీఎం చిత్రపటం లేకపోవడంతో ముఖ్యమంత్రికి ఇచ్చే గౌరవం ఇదేనా, ప్రోటోకాల్ పాటించరా అంటూ రుసరుసలాడుతూ శిలాఫలకం తెరను మూసివేసి రోడ్డు భవనాల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లపై మండిపడి అసహనం వ్యక్తం చేస్తూ అక్కడనుండి వెనుతిరిగారు. దీంతో కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఖంగుతిన్నారు. ఈ సంఘటనపై పలు వివరాలు వెల్లువెత్తుతున్నాయి. సరుబుజ్జిలి జంక్షన్ నుండి యరగాం వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆర్‌అండ్‌బి స్థలాన్ని కొంతమంది అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు ఆక్రమించుకొని కొంతమంది చిరు వ్యాపారులకు లక్షల రూపాయల్లో విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిరు వ్యాపారులు రోడ్డు వెడల్పు అయితే తమ పరిస్థితి ఏమిటని ద్వితీయ శ్రేణి నాయకులను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

గజానికో గుంత, అడుగుకో గొయ్యి ఉన్న రహదారితో ఇప్పటికే నానా అవస్థలు పడుతున్నామని, ఇప్పటికైనా రహదారికి మోక్షం కలిగిందని సంతోషిస్తుంటే పడుతున్న సమయంలో సిఎం చిత్రపటం లేకపోవడంతో శంకుస్థాపన వాయిదా పడటం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి చేయాల్సిన పనులను అర్ధాంతరంగా వదిలేసి వాయిదా వేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు పునరాలోచించి రహదారి పనులు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నేత్రాలపై అప్రమత్తం

బస్సులో వెళ్లేందుకు వేచి ఉన్న కంటి రోగులు

రణస్థలం : నేత్రాలపై అప్రమత్తంగా ఉండాలని కళ్యాణి కంటి ఆస్పత్రి ప్రొప్రైటర్ కళ్యాణి అన్నారు. మండల కేంద్రంలో గురువారం కళ్యాణ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి 85 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించి 16 మందికి కంటి శస్త్రచికిత్సకు ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బస్సులో తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు చాలా రకాల కారణాలతో చూపును కోల్పోతున్నారని, ఎక్కువ మంది జీవితం చీకటి మయం కావడానికి కంటి శుక్లాలు కారణంగా చెప్పవచ్చన్నారు. వయసు పెరుగుతున్న కొద్దీ ఈ సమస్య వచ్చే అవకాశాలు పెరుగుతాయని, సరైన అవగాహన లేక ఆలస్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కంటి శుక్లం శస్త్రచికిత్స జరిగిన తర్వాత కొంత విశ్రాంతి తీసుకుని అదే రోజు ఇంటికి వెళ్లవచ్చునని, ఏవైనా సమస్యలు ఉంటే వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు.

హత్యకు గురైన కామమ్మ (ఇన్‌సెట్‌లో కామమ్మ ఫైల్)

వృద్ధురాలి హత్య!

ప్రజాశక్తి- మందస/పలాస
మందస మండలం చిన్నబోగాబందలో వృద్ధురాలు హత్యకు గురైంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తామాడ కామమ్మ (70) గ్రామానికి సమీపంలో ఉన్న తన జీడి తోటను చూసేందుకు బుధవారం సాయంత్రం వెళ్లింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తోటకు వెళ్లి వెతికారు. తోటలో రక్తపు మడుగులో, గాయాలతో విగతజీవిగా పడి ఉన్న తల్లిని చూసి బోరున విలపించారు. మృతదేహాన్ని పరిశీలించగా... ఆమె చెవి, ముక్కు కోసేసి మూడు తులాల బంగారు ఆభరణాలు దోచుకున్నారని మృతురాలి పెద్ద కుమారుడు రామ్మూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీడితోటకు వెళ్లి వస్తుండగా కొంత మంది దుండగులు అటకాయించి నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేసి బంగారం ఆభరణాలను దొంగిలించారని కుటుంబ సభ్యులు వాపోయారు. పలాస డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి, మందస పోలీసులు గురువారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శ్రీకాకుళం నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి వేలి ముద్రలను సేకరించారు. శవపంచనామా అనంతరం పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మందస పోలీసులు

క్రైమ్ కార్నర్

కేసు దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధురాలి హత్యతో ఉద్దన ప్రాంతం ఉలిక్కిపడింది. ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని బొరిగిపేటకు చెందిన దివ్వల చిలకమ్మ (75) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనారోగ్య కారణాలతో ఆమె పైడతంతో ఈ నెల 24న ఇంట్లో ఉన్న గడ్డి మందు ను తాగి అపస్మారకస్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు గుర్తించి టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 25న మృతి చెందింది. మృతురాలి కుమార్తె కృష్ణ వేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ కృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త జగన్నాథరావు గతంలో మృతి చెందారు. కుమారుడు, కుమార్తె వేరే చోట్ల ఇంట్లో ఒంటరిగా ఉంటోంది.

మహిళపై దాడి

ఆమదాలవలస : మండలంలోని మర్రిపాడుకు చెందిన కందుల రమణమ్మపై గుర్తు తెలియని అగంతకుడు దాడి చేయగా ఆమె ప్రతిఘటించడంతో గాయాలపాలైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రమణమ్మ గురువారం ఉదయం మర్రిపాడు నుండి గడ్డగట్టు పైనుండి సరుబుజ్జిలి మండల కేంద్రానికి బ్యాంక్, వ్యక్తిగత పనులు నిమిత్తం వచ్చి పనులను ముగించుకొని తిరిగి మర్రిపాడు గ్రామానికి వెళ్తుంది. వంశధార కుడి కాలువ గట్టు దారిలో ఆమె వెళ్తుండగా ఒక అగంతకుడు దారికాచి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకోవడానికి ప్రయత్నం చేశాడు. దీంతో ఆమె అగంతకుడిపై తిరగబడడంతో పెనుగులాట జరిగిన సమయంలో ఆమె ముఖంపై అగంతకుడు ఇటుకరాయితో గాయపరిచి అక్కడి నుండి పారిపోయాడు. గాయాల పాలైన రమణమ్మను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్‌ను వివరణ కోరగా మహిళపై జరిగిన దాడి సంఘటనపై సిసి ఫుటేజీలు పరిశీలించామని, రిమ్స్ ఆస్పత్రి నుండి ఎటువంటి సమాచారం రాలేదని, వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల కాలంలో సరుబుజ్జిలి మండలంలో వరుసగా అసాంఘిక కార్యకలాపాలు, మహిళలపై దాడులు, దొంగతనాలపై వరుస ఘటనలు జరుగుతుండడం తో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

పిఎన్ కాలనీలో చోరీ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పిఎన్ కాలనీ ఆరో లైన్‌లోని ఐ.రాంప్రసాద్ ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే... రాంప్రసాద్ భార్య ఇటీవల మృతి చెందింది. దీంతో ఆమె కర్మకాండలు చేసే నిమిత్తం కుటుంబ సభ్యులు రాజ మండ్రి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరన్న విషయాన్ని పసిగట్టిన దొంగలు బుధవారం రాత్రి చొరబడ్డారు. వెండి వస్తువులు, మృతురాలి బంగారు గాజులు అపహరించారు. గురువారం ఉదయం రాంప్రసాద్ సోదరుడు ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. వెంటనే రాంప్రసాద్‌కు చెప్పి ఎస్ఐ లక్ష్మి మహన్నాటకులకు చేరుకుని పరిశీలించారు. అనంతరం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు. టౌన్ డిఎస్‌పి శృతి అక్కడకు చేరుకుని దొంగతనం జరిగిన తీరుపై ఆరా తీశారు.

చెట్లను తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సింగరావు

సిఆర్ఎంటిఎస్ సమస్యలపై స్పీకర్‌కు వినతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ (సిఆర్ఎంటియస్) ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం స్పీకర్ తమ్మినేని సీతారాంకు వినతిపత్రం అందజేశారు. గురువారం పట్టణంలో స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ స్పీకర్‌ను కలిసి ఉద్యోగభద్రత కల్పించాలని, మినిమం టైం స్కేల్, జిఒ నెంబర్ 65 ప్రకారం జాబ్ చార్ట్, 23 శాతం జీతాల పెంపుదల తదితర సమస్యలపై స్పీకర్‌కు వినతిపత్రం అందజేసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యల విన్న స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు ఉద్యోగులు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో పి.తవిటినాయుడు, జిల్లా అధ్యక్షులు బి.గిరి, జిల్లా కార్యదర్శి బొడ్డేపల్లి నర్సింగరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సిసిలోకి విద్యార్థినులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఎన్‌సిసి కొత్త కేడెట్ల ఏర్పాటులో భాగంగా విద్యార్థినిలకు ప్రవేశం కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో ఇప్పటి వరకు శ్రీకాకుళంలో ఉన్న 14వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి ఆధ్వర్యాన సీనియర్ డివిజన్ మాత్రమే ఉందని, అందులో పురుషులకు మాత్రమే గతంలో ఎన్‌సిసిలో చేరేందుకు వీలుండేదని తెలిపారు. ఈఏడాది నుంచి అందులో సగం మంది విద్యార్థినులు చేరేందుకు అవకాశం కల్పించాలని బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ బెనర్జీని కోరడంతో ఈ వెసులుబాటు కల్పించారన్నారు. కళాశాలలో చదవుతున్న విద్యార్థినుల ఎన్‌సిసి సీనియర్ వింగ్ పర్యవేక్షణకు కళాశాలలో పనిచేస్తున్న వాణిజ్య విభాగశాస్త్ర అధ్యాపకులు ఎన్.పావని వ్యవహరించనున్నట్టు వివరించారు. దేశరక్షణలో పురుషులతో పాటు మహిళలకు అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా విద్యార్థినిలు ముందుకు రావడానికి దోహదపడుతుందన్నారు. విద్యార్థినిలకు అవకాశం కల్పించడానికి సహకరించిన 14 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అమిత్ బెనర్జీ, కళాశాల ఎన్‌సిసి సీనియర్ డివిజన్ అధికారి, జంతుశాస్త్ర విభాగాధిపతి కెప్టెన్ డాక్టర్ వై.పోలినాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో వర్షాలు లేక సాగునీరు అందక రైతులు అల్లాడిపోతుంటే... వైసిపి ప్రభుత్వం పట్టించుకోకుండా బస్సు యాత్ర చేయడం కాదని, జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓట్లను ఎలాగ లాగేసుకోవాలో చూస్తుందో తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. సకాలంలో వంశధార నీరు అందక పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో వరిసాగు పూర్తిగా ఎండిపోయి నాశనమైందన్నారు. ప్రతి రైతు కుటుంబానికీ ఈ-క్రాప్ నమోదు చేసి నష్టాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్న పేద రైతు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ప్రతి రైతు కుటుంబానికీ రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి వచ్చేలా పనులు కల్పించాలన్నారు. వలస కూలీలను నివారించి నెలకు సరిపడే నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణాలను పూర్తిగా మాఫీ చేసి కొత్త రుణాలను మంజూరు చేయాలని కోరారు. నిత్యవసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు తగ్గించాలన్నారు.

జెఎన్‌టియు (వి) సిండికేట్ మెంబర్‌గా దుప్పల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దుప్పల వెంకరావు

జిల్లాకు చెందిన ప్రముఖ విద్యావేత్త, పారిశ్రామికవేత్త, సామాజికవేత్త దుప్పల వెంకటరావుకు ప్రతిష్టాత్మక జెఎన్‌టియు విజయనగరం పాలకమండలి సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ శివాని విద్యా సంస్థల వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆయన వివిధ రంగాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. శ్రీసాయి స్పందన డిజిటల్ కమ్యూనికేషన్స్ సంస్థను నిర్వహిస్తున్నారు. విద్యావేత్తగా ఉన్న ఆయనకు జెఎన్‌టియు (వి) పాలక మండలిలో చోటు కల్పించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

దుష్ట పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

దుష్టులు పాలించిన దుష్ట రాజకీయ పాలనకు రోజులు దగ్గర పడ్డాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి వర్యులు, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి కళా వెంకటరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు సంఘీభావంగా ఆయన త్వరగా ఈ కేసుల నుంచి బయట పడాలని రాష్ట్రంలో ఉన్న పుణ్య క్షేత్రాల దర్శనం కోసం సైకిల్‌యాత్ర చేపట్టి మార్గమధ్యలో పుంగనూరు వైసిపి దుష్టశక్తుల అరాచకాలను అధిగమించి దిగ్విజయంగా యాత్రను పూర్తి చేసుకొని మండలానికి చేరుకున్న నారువ పంచాయతీ మాజీ సర్పంచ్ నిద్రభింగి రామకృష్ణ బృందానికి పైడిభీమవరంలో గురువారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి నాయకులు చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి చమరగీతం పాడతారన్నారు.

రామకృష్ణకు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మిదేవి, కొండపల్లి అప్పలనాయుడు, టిడిపి సీనియర్ నాయకులు పిషిణి జగన్నాథం నాయుడు, ఎంపిటిసి పిసిని ఆసిరినాయుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు పైడి అప్పడుదొర, మండల తెలుగు యువ నాయకులు పిషిణి హరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థినిలకు లైంగిక వేధింపులు, దాడులపై జిఆర్‌పి ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా లైంగిక వేధింపులు, దాడులను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న లైంగిక చర్యలపై రక్షణ అనే అంశంపై విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి రామకృష్ణ, జిఆర్‌పి సిబ్బంది శశి కుమార్, రోజా, లోకనాథం పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం మండలంలోని కొత్తకోట వద్ద రూ.40 లక్షలతో పిఎసిఎస్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. గతంలో ప్రభుత్వాల్లా మాటలు కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నారన్నారు. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు మార్కెట్ కమిటీల దగ్గర పడిగాపులు కాసేవారని వారి ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. రైతుకు కూడా ఒక కార్యాలయం ఉండాలని చెప్పి మొట్టమొదటిసారిగా సిఎం జగన్మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కిల్లి వెంకట సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి గోవింద్ శివానందమూర్తి, మూడడ్ల రమణ, బద్రి రామారావు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

పంటల నమోదు జాబితా ప్రదర్శన

జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శిస్తున్న ఎఒ మోహనరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతులు పంటను ఇ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు అన్నారు. గురువారం మండలంలోని కట్యాచార్యులపేటలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి నోటీసు బోర్డులో ఇ క్రాప్ పంట నమోదు చేసిన జాబితాను సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 గురువారం నుండి 29వ తేదీ ఆదివారం వరకు జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. అలాగే గ్రామసభలు నిర్వహించి రైతుల నుండి వచ్చిన అభ్యర్థనలను పొందుపరుస్తామని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి రైతు భరోసా కేంద్రానికి వెళ్లి వారు సాగు చేసిన పంటల వివరాలు సరి చూసుకోవాలని కోరారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే రైతు భరోసా కేంద్రంలోని అగ్రికల్చరల్ అసిస్టెంట్‌కు వివరాలు తెలియజేస్తే గ్రీవెన్స్‌లో పెట్టి సరిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ఖరీఫ్-23 పంటల నమోదు సంబంధించి రైతుల జాబితాలు రైతు భరోసా కేంద్రాల వద్ద గురువారం ప్రదర్శించామని మండల ఎఒ దానకర్ణుడు తెలిపారు. రైతులు తమ వివరాలను సరిచూసుకోవాలన్నారు. అలాగే ఏవైనా వివరాలు సరిచేయాల్సి ఉంటే గ్రామ వ్యవసాయ సహాయకులకు ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ప్రపంచ శాంతికి నడుం కట్టాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ శాంతికి విద్యార్థులు నడుంకట్టాలని లయన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ అన్నారు. గురువారం ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యాన నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో 1945 ఏప్రిల్ 25నుండి జూన్ 26 వరకు జరిగిన అంతర్జాతీయ సమావేశంలో 51 దేశాల ప్రతినిధులు పాల్గొని ఐక్యరాజ్య సమితి ఛార్టర్‌పై సంతకాలు చేశారన్నారు. 1945 అక్టోబరు 24న న్యూ యార్క్ నగరంలో ఐక్యరాజ్య సమితి లాంఛనంగా ప్రారంభమైందని చెప్పారు. ప్రపంచ శాంతి, సహనం, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలు స్తుందన్నారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ చార్టెడ్ ప్రెసిడెంట్ నటుకుల మోహన్, లయన్స్ క్లబ్స్ జోన్ చైర్మన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, కోశాధికారి శిల్లా మణి, సీపాన రమేష్ కుమార్, లయన్స్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ సునీల్ కుమార్, సభ్యులు కామేష్, న్యూ సెంట్రల్ స్కూల్ డైరక్టర్ శ్రీకాంత్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సభ్యుల డేటాను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్వయంశక్తి సంఘాల్లోని సభ్యులందరి పూర్తి సమాచారాన్ని ఆధార్‌కార్డు ప్రకారం ఆన్‌లైన్‌లో, లోకోస్ యాప్ ద్వారా ప్రతి విఒఎ ఖచ్చితంగా నమోదు చేసే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఎచ్చెర్ల ఏరియా కో-ఆర్డినేటర్ పి.రవికుమార్ సూచించారు. గురువారం గ్రామాల్లో జరుగుతున్న సర్వే పరిశీలనలో భాగంగా దూసి గ్రామ సంఘంలో పాల్గొని ఆయన మాట్లాడారు. సమాచారాన్ని పొందుపర్చడంలో వస్తున్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని సంఘాలు పొదుపు చేసుకున్న సొంత నిధుల నుండి సభ్యురాలు అవసరం మేరకు అప్పులు ఇస్తూ తిరిగి వసూలు చేసుకోవాలని సూచించారు. పుస్తక నిర్వహణను పరిశీలించి సంఘంలో జరుగుతున్న లావాదేవీలన్నింటినీ విపులంగా పుస్తకాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం పైడి కూర్మారావుతో పాటు క్లస్టర్ కో-ఆర్డినేటర్ మామిడి చంద్రావు, విఒఎ సునీత, పావని, స్వయంశక్తి సంఘాల లీడర్లు, గ్రామ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న రవికుమార్

ఆరోగ్యానికి వాకర్స్ క్లబ్స్ దోహదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సంపూర్ణ ఆరోగ్యం సాధించడానికి వాకర్స్‌క్లబ్స్ సభ్యులుగా చేరడంతోనే సాధ్యమవుతుందని, ప్రతిఒక్కరు విధిగా వయస్సుతో సంబంధం లేకుండా మీమీ ప్రాంతాల్లో ఉన్న వాకర్స్ క్లబ్‌లో చేరాలని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్లు జి.ఇందిరా ప్రసాద్, పిజి.గుప్తా విజ్ఞప్తి చేశారు. గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు స్వర్గీయ సుంకరి ఆళ్వార్ దాస్ జయంతి వేడుకల సన్నాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ ఆరోగ్య ప్రదాతలుగా, సేవాతత్పురులుగా నిలవటానికి వాకర్స్ సంస్థలు ఎంతో దోహద పడుతున్నాయన్నారు. 1986లో రాష్ట్రంలో విశాఖపట్నం కేంద్రంగా స్థాపించిన వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలో ప్రస్తుతం 5లక్షల మంది సభ్యులున్నారని, దేశ విదేశాల్లో వాకర్స్ క్లబ్స్ విస్తరించాయన్నారు. ఈ సమావేశం స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు అధ్యక్షతన జరిగింది. వాకర్స్ క్లబ్స్ వ్యవస్థాపకులు స్వర్గీయ సుంకరి ఆళ్వార్ దాస్ జయంతి వేడుకలు ఈనెల 31న జరపడానికి తీర్మానించారు. సమావేశంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి.వి.రవిశంకర్, బి.దేవీప్రసాద్, గురు ఆనందరావు, ఎస్.సంజీవరావు, గోలీ ఉమామహేశ్వరరావు, ఎం.మల్లిబాబు, గుడ్ల జగ్గారావు, నల్లబాటి కృష్ణమూర్తి, వై.మోహన్, బి.కృష్ణారావు, జి.లక్ష్మీ, పట్నాన సత్యనారాయణ, బొడ్డేపల్లి ప్రసాదరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇందిరాప్రసాద్

హక్కుల సాధనకు కృషి

ప్రజాశక్తి- పర్లాకిమిడి

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలనే ఉద్దేశంతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి తదితర తరగతుల్లో ఆర్థికంగాను, సామాజికంగాను వెనుక బడిన వారిని గుర్తించి అభివృద్ధికి కృషి చేస్తామని అఖల భారత్ ఎస్‌సి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రట్టి కృష్ణారావుపాత్రో అన్నారు. గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణం జగన్నాథం ఆలయ ప్రాంగణంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులను సాధించుకునేందుకు పోరాటం చేస్తామని అన్నారు. రాజ్యాంగంలోని హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాచే ప్రయత్నం చేస్తుందని అన్నారు. దేశంలోని అటవి భూ భాగంలో మూడో వంతు కార్పొరేట్ సంస్థలకు దారాధత్తం చేయడానికి ఓ చట్టాన్ని తీసుకొస్తుందని అన్నారు. కార్యక్రమంలో కింజరాపు బాలకృష్ణ, జమానా కర్రయ్య, బాణిప్రసాద్ మాలి, ముచ్చి బంగారయ్య, రొక్కం లోకనాథం, త్రినాథరావు, సతివాడ మురళి, పెంట్ల కృష్ణారావు, బాణి ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణారావుపాత్రో